సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 12 । జనవరి । 2023



ట్యాంక్‌ల పరిశీలన

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం నిర్వహణను నాబార్డు బృందం బుధవారం పరిశీలించింది.



డాబీ సబ్సిడీ అందించాలి

సిరిసిల్లటౌన్: ఆసాములకు డాబీ సబ్సిడీ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ కోరారు. సమస్య పరిష్కరించకుంటే ఈనెల 15 నుంచి సమ్మె చేస్తామని నోటీసు అందించారు.

గరిష్టం/కనిష్టం
30.0/12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

యువ ‘కలం’..

- రచయితలుగా రాణిస్తున్న మన యువత
- కలంపట్టి గళమెత్తుతున్న కవులు
- యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు

‘ఉక్కు నరాలు వజ్ర సంకల్పమున్న యువతను నాకు ఇస్తే.. ఈ దేశాన్ని మారుస్తా’ అని స్వామి వివేకానంద సూక్తి. వివేకానందుడి ఆశయాలను కొనసాగిస్తూ సమాజ మార్పునకు ఉక్కునరాలు పిడికిలెత్తాయి. యువ కలాలు సమాజ హితానికి గళమెత్తాయి. మార్పును కోరుతూ రచనలు చేస్తున్నాయి. వాళ్ల కలం నుంచి జాలువారిన.. జాలువారుతున్న ఒక్కో సిరాచుక్క ఎంతో మందిని ప్రభావితం చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువత అక్షరాలు, సాహితీ తోటలు వికసిస్తున్నాయి. సుగంధాలు పంచుతున్నాయి. కవిత, పాట, కథ ఇలా ప్రక్రియ ఏదైనా.. పైచేయి తమదే అంటున్న సాహితీ సేద్యకులపై వివేకనందుడి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు..

– సాక్షి, కరీంనగర్ డెస్క్



ఈ ‘రవీంద్రుడు’.. కవీంద్రుడు



ఓదెల మండల కేంద్రానికి చెందిన బ్రాహండ్లపల్లి రవీంద్రాచారి వృత్తిరీత్యా ఆర్టిస్ట్. ఓ వైపు బొమ్మలేస్తూనే.. మరోవైపు సాహిత్యంలో రాణిస్తున్నారు. కంటితో చూసిన దృశ్యానికి చిత్రరూపం ఇస్తూ మనసులో మెదిలినభావాలను అక్షరబద్ధం చేస్తున్నారు. 2002 నుంచి కవితలు రాస్తున్నారు. వివిధ సంకలనాల్లో ఆయన రాసిన కవితలు ప్రచురితమయ్యాయి. భగవంతుని స్వరూపం కవిత రాసినందుకు గాను డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2015లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఓదెల మండల ఉత్తమ సాహితీ వేత్తగా అవార్డుతోపాటు రూ.10 వేలు చెక్కు అందుకున్నారు. 2020 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పుట్టిన రోజును పురస్కరించుకుని కరోనాపై కవితల పోటీలో పాల్గొన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కన్సోలేషన్ అవార్డ్, రెండు వేల రూపాయల చెక్కు అందుకున్నారు. అంతేకాదు జానపద సినీ గీతాల రచనలోనూ రవీంద్రచారి ప్రతిభ కనబరుస్తున్నారు. సినిమాలకు జానపద సాహిత్యం అందించడమే తన ధ్యేయమని ఆయన చెబుతున్నారు.

భావానికి ఆత్మ.. ‘పాళీ’

సిరిసిల్లలో పుట్టిన చిందం మల్లేశం డిగ్రీ వరకు చదివారు. ప్రస్తుతం గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. కవిత్వంపై మక్కువతో ‘పాళీ’ అనే కలం పేరుతో కవిత్వాన్ని రాస్తున్నారు. చిన్నతనంలో సిరిసిల్ల నేత కార్మికుల బతుకు వ్యథలను చూసిన ఆయన కవిత్వాన్ని అయుధంగా చేసుకొని వాళ్ల బతుకుచిత్రంపై ఎన్నో కవితల్ని రాశారు. స్వతహాగా నేసిన అనుభవంతో నేతన్నల జీవన శైలిని తన కవితా వస్తువుగా చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు ప్రశంసలు అవార్డులు అందుకున్నారు. ‘అక్షరం అమ్మయితే ఆవేదన నాన్న..’ వీటి సంతానమే సాహిత్యం అని ఆయన భావన. సమాజాన్ని అద్దంలో చూపించాలంటే కేవలం సాహిత్యంతోనే సాధ్యమని తన అడుగులను సాహిత్యం వైపు వేస్తున్నారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా కవితలు రాశారు. కరోనా సమయంలో ‘మాస్క్ పెట్టు.. మావా మాస్క్ పెట్టు’ రాసిన పాట, ఇటీవల పోలీసులపై రాసిన పాటలు ఆయనకు ఎంతో పేరును తెచ్చిపెట్టాయి.

‘మా ఊరి చెరువులో చేపలు బతుకుతాయి..
మనుషులు చస్తారు
ఎముకలపై చలి అత్యాచారం చేస్తుంటే..
చెమటలు చలి చీమలవలె కొరికేస్తుంటే..
మగ్గంపై మొగ్గయింది తెల్లని బట్ట..
అయినా.. మాకది చీమల పుట్ట’

అంటూ వారి చేతికందని బట్ట గురించి ఎంతో లోతుపాతుగా కవిత్వాన్ని రాశారు.



మరో కవితలో...

‘ఇక్కడి దేహాలు బొక్కల్ని
దాచుకునే అలమరాలు
శవాల్ని ముద్దాడే గులకరాళ్లు’

అంటూ నేతన్నల ఆత్మహత్యల గురించి తనదైన శైలిలో కలాన్ని విదిలించారు.

పేదరికం గురించి రాస్తూ..

‘విశ్వానికి ఒకడే సూరీడు
తడకల ఇంటికి లెక్కపెట్టలేనన్ని సూర్యుళ్లు
నాన్న గొంతులోకి దిగిన కళ్ల చుక్కలు
నా గుండెల్యాబ్‌లో మారిన కన్నీటి చుక్కలు
ఎంత లోతో జీవితం కాలికి గుచ్చిన ముల్లునడుగు..
ఎంత ఎరుపో జీవితం కడుపులో మండుతున్న సూర్యున్నడుగు
ఎంత నలుపో జీవితం చేతికి అంటిన కందెననడుగు..’

అంటూ వచన కవిత్వంతోపాటు మినీ కవిత్వాన్ని కూడా రాశారు.

వృత్తి వ్యాపారం.. ప్రవృత్తి సాహిత్యం



దొమ్మటి శంకర్ ప్రసాద్‌ది కరీంనగర్ జిల్లా కేంద్రం. వృత్తిరీత్యా వ్యాపారి. ఆకట్టుకునే రచనలు చేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి శ్రీశ్రీ, తిలక్, ఠాగూర్ కవిత్వానికి ఆకర్షితుడై కవిత్వం రాస్తున్నారు. కరీంనగర్ సాహితీ పెద్దలు ఆయనకు మరింత ప్రోత్సాహమిచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ శాఖకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన ఇప్పటివరకు అనేక అవార్డులు సన్మానాలు అందుకున్నారు. సాహిత్యంలో పీహెచ్‌డీ చేయాలనేది శంకర్ కల. ‘ఫిట్టర్ కొమురయ్య కథలు’ పుస్తకాలను ఆయన త్వరలోనే ఆవిష్కరించనున్నారు.

సాహిత్యంలో ‘మెరుగు’



మెరుగు ప్రవీణ్‌ది రామడుగు మండలంలోని గోలి రామయ్యపల్లి. కరీంనగర్ జిల్లాలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. తండ్రి లక్ష్మీనారాయణ తబలా వాయిద్యకారుడు కావడంతో ప్రవీణ్‌కు చిన్నప్పటి నుంచి కళలపై ఆసక్తి ఏర్పడింది. కళలపై ఇష్టంతో సాహిత్యంలో రాణిస్తున్నారు. పాటలు రాసి పాడుతూ యూట్యూబ్‌లో రిలీజ్ చేస్తున్నారు. ఎస్సార్‌ఆర్ కళాశాల వలంటీర్ ఆర్గనైజేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా రంగంలో ఇప్పటివరకు అనేక అవార్డులు అందుకున్నారు. సమాజ మార్పును ఆశించే కవిత్వం రాస్తూ ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు. ‘జీవన ప్రయాణం’, ‘మేల్కొనండి’ పేరిట రెండు కవితా సంపుటాలను ప్రచురించారు.

‘సౌమ్య’మైన కవిత్వం



ఈడెపు సౌమ్యది రాజన్న సిరిసిల్ల జిల్లా. సౌమ్య సిరిపూర్‌లో ఆరో తరగతి చదువుతున్నప్పుడు అందుడైన ఉపాధ్యాయుడు శ్రీధర్ స్వామి సాహిత్యం ఆకట్టుకుంది. తెలుగు టీచర్ జానకి పాఠాలు సాహిత్యం వైపు నడిపించాయి. అప్పట్నుంచి అలవోకగా సౌమ్య కవితలు అల్లుతూ వస్తున్నారు. వందల కొద్ది కవితలు రాశారు. ‘సౌమ్య అలలు’ పేరుతో కవితల పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈనాటి యువతరాన్ని చైతన్య పరిచేలా కవితలు రాస్తూ ముందుకు సాగుతున్నారు. ‘మానేటి ఒడ్డున పుట్టి పెరిగినందున ఆ నదితో ఉన్న అనుబంధమే ఇప్పుడు నన్ను కవయిత్రిని చేసింది’ అని ఆమె చెబుతున్నారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పే సుగుణ కలం



బెజ్జంకి మండలం గూడెం గ్రామంలో పుట్టిన మాంకాలి సుగుణ పీజీ, బీఎడ్ పూర్తి చేశారు. ప్రస్తుతం బెజ్జంకి మోడల్ స్కూల్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. డిగ్రీ చదువుతున్నప్పటి నుంచి కవిత్వం రాస్తున్నారు. అమ్మ మల్లవ్వ స్ఫూర్తితో, తాను చూసిన పేదకుటుంబాల గురించి... రైతులు.. స్త్రీల గురించి అద్భుతమైన కవిత్వం రాస్తున్నారు. సుగుణ దివ్యాంగురాలైనప్పటికీ తనలాంటి వారి కష్టాలను బాధలను పాటలు, కవితల రూపంలో అక్షరీకరిస్తున్నారు.

‘కారు మబ్బులు
కమ్మిన కటిక చీకటి
రేయి పగలు కనిపించని
న్యాయ దేవతలే
అడుగు తీసి అడుగులే వేయలేని నడకలే
విధి వైపరీత్యాలే వెక్కిరింతల్లై
ఎవ్వరికి ఏమని చెప్పని జీవితాలు
మానవత్వ విలువలకు ప్రతిరూపాలు’

అంటూ.. దివ్యాంగుల బాధలను వారు వైకల్యంతో ప్రతిక్షణం మానసికంగా కుంగిపోతున్న విధానాన్ని పాట రూపంలో రాశారు. ఇలా ఇప్పటివరకు 480 కవితలు 60 పాటలు, పలు కథలు రాసి రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్నారు. దివ్యాంగురాలైనప్పటికీ ఆమెకున్న ఆత్మస్థైర్యం నేటి యువతకు ఆదర్శం.

దోపిడీ సమాజాన్ని ప్రశ్నించే ‘కర్ణాకర్’



జమ్మికుంటకు చెందిన రామగుండం కర్ణాకర్ పరిశోధక విద్యార్థి. ఇప్పటివరకు 500లకు పైగా కవితలు రాశారు. వ్యవస్థీకృతమైన దోపిడీ సమాజపు రూపాన్ని నగ్నంగా చూపిస్తూ.. అందులో సమిధలవుతున్న అభాగ్యులకు ఆయన అక్షరాలను అందించేందుకు చిరు ప్రయత్నం చేస్తున్నారు. ‘కలం ఖాండ్రించి ఉమ్ముతోంది’ అనే పుస్తకాన్ని రాశాడు.

‘ఒరేయ్... పచ్చ నోట్ల
అక్షరమన బిచ్చపోళ్లారా...
ఈ కలంలోని సిరా
ఖాండ్రించి ఉమ్ముతోందిరా..
మనసులోని నిజాయితీ
పొరలు పొరలుగా నిగ్గదీసి
అడుగోతోందిరా...
నిస్సిగ్గుగా సిగ్గునొదిలేసినా
సిరాబతుకుల
బజారులో అక్షరాలమ్ముకొంటూ
లక్షల కోట్ల రంగురంగు
తెరలపై రాజభోగమనుభవిస్తోన్న
పచ్చ నోట్లకూ కక్కుర్తిపడ్డ
కలం కుద్పుడ్డులజూసి
ఈ కలం మీ మొహంపై
ఖాండ్రించి ఉమ్ముతోందిరా’

అంటూ కలంతో ఎండగడుతున్నారు.

న్యూస్‌రీల్

మోదీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు



సిరిసిల్లటౌన్: ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం అన్నారు. సిరిసిల్లలోని తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లలో పర్యటించిన సందర్భంగా మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. సెస్‌లో అవినీతి రహిత పాలన అందిస్తామన్న కేటీఆర్.. గతంలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మి, పట్టణాధ్యక్షుడు అన్నల్‌దాస్ వేణు, జిల్లా అధికార ప్రతినిధి కమలాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజాసింగ్, సిరాస్వాల్ కైలాశ్ ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి



వేములవాడ: గుట్టలను ధ్వంసం చేస్తూ మట్టిని తరలిస్తూ పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారని.. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు బుధవారం వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజేశ్వర్‌రావు హయాంలో అనుమతులిస్తే కొడుకు రమేశ్‌బాబు హయాంలో పట్టాభూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. అగ్రహారం, నాంపల్లి గుట్టల్లో జరుగుతున్న అక్రమాలను వెంటనే ఎమ్మెల్యే రమేశ్‌బాబు బయటపెట్టాలని కోరారు. రూ.వంద కోట్ల కుంభకోణం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2020లో ఒర్రెను ఆక్రమించుకుని చెక్‌డ్యామ్ పూడ్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ జారీ చేసిన ఉత్తర్వులను మీడియాకు చూపించారు. వెంకటస్వామి, పిల్లి కనకయ్య, కొమురయ్య, శ్రీనివాస్, చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, కత్తి కనకయ్య, ఎర్రం ఆగయ్య, ప్రకాశ్, రాజు, ఎర్ర శ్రావణ్, కృష్ణ, సాబీర్, మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మొదలైన రేషన్‌బియ్యం పంపిణీ



సాక్షి ఎఫెక్ట్

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎట్టకేలకు రేషన్ బియ్యం పంపిణీ మొదలుపెట్టారు. ‘సాంకేతిక లోపం.. అందని రేషన్’ శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి స్పందించారు. ఈపాస్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించారు. ఈనెల 1 నుంచి పంపిణీ చేయాల్సిన రేషన్‌బియ్యం.. పదో తేదీ వరకూ అందించకపోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతి పండుగకు సంబంధించిన పిండివంటలు చేసుకోలేకపోయారు. ‘సాక్షి’ కథనానికి అధికారులు స్పందించి తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 345 రేషన్ దుకాణాలలో బియ్యం పంపిణీ మొదలైంది.

ఈశ్రమ్ కార్డుతో లాభాలు



సిరిసిల్లటౌన్: అన్నిరంగాల కార్మికులకు ఈ–శ్రమ్ కార్డు తప్పనిసరి తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహ్మద్ రఫీ పేర్కొన్నారు. సిరిసిల్లలోని అంబద్కర్‌నగర్, భావనరుషినగర్‌లో కార్డులపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కార్డు ఉన్న వారికి రూ.2లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. లేబర్‌శాఖ జూనియర్ అసిస్టెంట్ రాంచంద్రం, పోచమ్మ ఆలయ చైర్మన్ సిరిగిరి మురళి, డైరెక్టర్ కూర శ్రీధర్ పాల్గొన్నారు.

ద్రవవ్యర్థాలకు ప్రత్యేక ఇంకుడుగుంతలు

- నెలాఖరులోగా పూర్తి చేయాలి
- గురువారం ప్లాస్టిక్ ఫ్రీగా పాటించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో లిక్విడ్‌వేస్ట్‌ను చెరువుల్లో, వాగుల్లో కలువకుండా నిరోధిస్తూ.. ప్రతీ ఊరిలో ఇంకుడుగుంతలు నిర్మించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్వచ్ఛసర్వేక్షణ్–2023పై అన్ని మండలాల ఎంపీడీవోలతో బుధవారం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లోగా అన్ని గ్రామాల్లో లిక్విడ్‌వేస్ట్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఘన వ్యర్థాలను సమర్థంగా నిర్వహిస్తూనే ద్రవవ్యర్థాల నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. ప్రతి ఊరిలోనూ మురుగుకాలువల చివరన తప్పనిసరిగా కమ్యూనిటీ ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాలన్నారు. నెలాఖరులోగా జిల్లాలో 500 కమ్యూనిటీ ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు.

మండలాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు

జిల్లాలోని అన్ని మండలాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని, గ్రామాల్లోని రోడ్లమీద చెత్త లేకుండా చూడాలన్నారు. చెత్తసేకరణకు ప్రత్యేక స్థలం ఉండాలని, ఇష్టారీతిన చెత్త వేసే వారికి జరిమానాలు విధించాలని సూచించారు. ‘ప్లాస్టిక్ ఫ్రీ గురువారం’ పేరిట ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పాడి గేదెల యూనిట్లు ఏర్పాటు చేయాలి

జిల్లాలో పాడి గేదెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న 443 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రాయితీ వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షల్లో 70 శాతం రాయితీగా.. 30 శాతం బ్యాంకు రుణంగా ఉంటుందని వివరించారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణం మంజూరు చేయాలన్నారు. జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డీపీవో రవీందర్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, ఎల్‌డీఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉద్యోగ లక్ష్యంతో అభ్యసించాలి

- సామాజికాంశాలపై పట్టు సాధించాలి
- ఎస్పీ రాహుల్‌హెగ్డే



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సిరిసిల్లక్రైం: పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఆందోళన చెందకుండా పట్టుదలతో సాధన చేసి అనుకున్న లక్ష్యాలను అందుకోవాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సిరిసిల్లలోని జిల్లా గ్రంథాలయంలో ‘లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా?’ అనే అంశంపై బుధవారం మాట్లాడారు. ‘ట్రెయిన్ యువర్ బ్రెయిన్.. గెయిన్ యువర్ జాబ్’ అనే విధానంలో ముందుకు సాగాలని సూచించారు. పోటీప్రపంచంలో సమకాలీన అంశాలను, చరిత్రను ఆర్థిక, సామాజిక, రాజకీయ, భౌగోళికాంశాలపై సమాచారం సేకరిస్తే విజయం సాధిస్తారన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలను చూసి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరు శంకరయ్యను అభినందించారు. నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి అధ్యక్ష, కార్యదర్శులు జనపాల శంకరయ్య వెంగళ లక్ష్మణ్‌ను సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, లైబ్రేరియన్‌లు శంకరయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి నాంది

వేములవాడ: ఆత్మవిశ్వాసమే విజయం వైపు తీసుకెళ్తోందని ఎస్పీ రాహుల్‌హెగ్డే పేర్కొన్నారు. వేములవాడలో జరిగే పలు కార్యక్రమాల్లో బుధవారం భాగస్వాములయ్యారు. ముందుగా తిప్పాపూర్ బస్టాండులో పోలీస్ కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సత్యంరెడ్డి ఏర్పాటు చేసిన ఉచితంగా కోచింగ్‌క్యాంప్‌లో యువకులకు పలు సూచనలు చేశారు. పోలీస్ శాఖ ద్వారా ఎలాంటి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న డీఎస్పీ నాగేంద్రాచారి, మెలకువలు నేర్పుతున్న రూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను అభినందించారు. సీఐలు వెంకటేశ్, బన్సీలాల్ పాల్గొన్నారు.

లష్కర్ల నియామకం

- 54 మంది వీఆర్‌ఏలకు బాధ్యతలు



ముస్తాబాద్(సిరిసిల్ల): ఎగువమానేరు ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం లష్కర్లను నియమించింది. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో రబీ సీజన్‌లో నాలుగు నెలలపాటు మానేరు కాల్వల నిర్వహణ బాధ్యతలను వీఆర్‌ఏలకు అప్పగించారు. ఈమేరకు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల పరిధిలోని 54 మంది వీఆర్‌ఏలకు కాల్వల నిర్వహణను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువలతోపాటు పిల్లకాలువలు శుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలి. ఏప్రిల్ 15 వరకు లష్కర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. డిస్ట్రిబ్యూటరీల వారీగా వీఆర్‌ఏలకు బాధ్యతలు అప్పగించామని ఏఈ వంశీకృష్ణ తెలిపారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



నగర సంకీర్తనలో విద్యార్థుల కోలాటం



వేదికపై నృత్య ప్రదర్శన



త్యాగరాజ చిత్రపటంతో అర్చకులు, అధికారులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఐదు రోజులపాటు జరిగే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. త్యాగరాజస్వామి చిత్రపటంతో నగర సంకీర్తన చేపట్టారు. స్థానిక సరస్వతీ శిశుమందిరం విద్యార్థినుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఉపన్యాసకులు జి.మహేశ్‌శర్మ త్యాగరాజస్వామి జీవిత విశేషాలు, శ్రీవిద్య, మంగళంపల్లి సువర్ణ బృందంచే పంచరత్నగానం, శిఖామణి, సుబ్రహ్మణ్యంచే హరికథ, వై.విజయవల్లి బృందంచే నృత్య ప్రదర్శనలు, ధర్మపురికి చెందిన లక్ష్మీనర్సింహా నాట్య మండలిచే నాటక కార్యక్రమాలు జరిగాయి. రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. సంగీతంపై విద్యార్థులలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మన సంస్కృతికి అద్దం పట్టేవి కళలేనన్నారు. సంస్కృతి, సాంప్రదాయాల మేళవింపు అయిన కళలు పాశ్చాత్య సంస్కృతి ప్రవేశంతో కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం 10 గంటలకు ధూళిపాక శివరామకృష్ణ హరికథ, మధ్యాహ్నం 3 గంటలకు నారదాసు హరికథ, సాయంత్రం 5 గంటలకు సుధీర్, సతీశ్‌లతో సంగీత కచేరి, సాయంత్రం 6.30 గంటలకు మల్లాది సూరిబాబుచే శాస్త్రీయ సంగీతం, రాత్రి 7.30 గంటలకు పాండురంగారావుచే సితార సోలో సంగీత కచేరి, రాత్రి 9.30 గంటలకు రతన్ బృందంచే నృత్య ప్రదర్శన, జైశ్రీ నాట్యమండలి వారిచే బ్రహ్మంగారి చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉంటాయని ఉత్సవాల ఇన్‌చార్జి రామయ్యశర్మ తెలిపారు.

ఇన్‌స్పైర్ మానక్‌లో సిరిసిల్ల సత్తా

సిరిసిల్లఎడ్యుకేషన్: నిర్మల్ జిల్లాలో ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్‌లో జిల్లా విద్యార్థులు సత్తాచాటి.. జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ గీతానగర్ విద్యార్థిని శ్రీసమర్థ తయారుచేసిన ‘ఎగ్ షెల్ రిమూవర్’, ఇల్లంతకుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సహస్ర రూపొందించిన ‘హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఓల్డ్ ఏజ్’, వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శ్రీనిధి తయారుచేసిన ‘బొండా మేకర్’ ఆవిష్కరణలు న్యాయనిర్ణేతలను మెప్పించాయి. వీరు త్వరలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఈవో చెప్పారు.

జవహర్‌లాల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇద్దరు..

జవహర్‌లాల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో దమ్మన్నపేట హైస్కూల్ విద్యార్థిని వినీల చేసిన ఆవిష్కరణ, చంద్రంపేట సైన్స్‌టీచర్ జాతీయస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఇన్‌స్పైర్ మానక్‌లో 33 జిల్లాల నుంచి 260 ఆవిష్కరణలు రాగా జాతీయస్థాయికి 26 మందిని ఎంపిక చేశారు. విద్యార్థులకు సహకారం అందించిన మాజీ సైన్స్ ఆఫీసర్ ఆంజనేయులతోపాటు గైడ్ టీచర్స్‌కు దోర్నాల భూపాల్‌రెడ్డి, మహేశ్‌చంద్ర, కిషన్, సంపత్‌లను డీఈఓ అభినందించారు.

క్లుప్తంగా

తపాలాకు చేరిన ముక్కోటి ప్రసాదాలు


ప్రసాదం కవర్లతో ఎస్పీఎం స్వామి,సిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): ఆలయాలకు వెళ్లకుండానే ముక్కోటి ఏకాదశి సందర్భంగా పోస్టు ద్వారా ప్రత్యేకంగా మూడు ఆలయాల్లో అర్చన సేవలందించేందుకు పోస్టల్‌శాఖ అవకాశం కల్పించింది. రూ.200లతో బుకింగ్ చేసుకున్న భక్తుల పేరిట యాదగిరి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, భద్రాచలంసీతారామచంద్రస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా అర్చనచేసి ప్రసాదం పంపించారు. ఈ ప్రసాదాలు బోయినపల్లి సబ్ పోస్టాఫీస్‌కు చేరాయని, తమ సిబ్బంది భక్తులకు అందిస్తారని ఎస్పీఎం ఎం.వి.స్వామి తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సిరిసిల్లఅర్బన్: ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ అడ్వకేసీ సొసైటీ 2023 న్యూఇయర్ క్యాలెండర్‌ను బుధవారం ఎస్పీ రాహుల్ హెగ్డే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ అడ్వకేసీ సొసైటీ చైల్డ్‌ప్రొటెక్షన్ కమిటీ మెంబర్ కుసుమ కవిత, జిల్లా అధ్యక్షురాలు చంద్రగిరి అలేఖ్య, వైస్‌ప్రెసిడెంట్ సర్కార్, శంకరయ్య, యమున,సుమలత,సుజాత, రాజు, నయీం చిరంజీవి, ప్రశాంత్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై శేఖర్ పేర్కొన్నారు. దుమాల జెడ్పీ పాఠశాల విద్యార్థులు సాంఘికశాస్త్ర క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పనితీరు, సివిల్, క్రిమినల్ కేసులు, ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహనకల్పించారు. హెచ్‌ఎం రవీందర్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఘటనపై విచారణ

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో జరిగిన ఘటనపై అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. బావుసాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రతిరోజూ మద్యం సిట్టింగులు నడుపుతూ, రైతులను దుర్భాలాడిన ఘటనపై, గ్రామస్తుడిపై జరిపిన దాడి గురించి విచారణ జరిపారు. ఎన్పీడీసీఎల్ ఏడీ ప్రదీప్ బావుసాయిపేట సబ్‌స్టేషన్‌కు వెళ్లి గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. ఆపరేటర్ నందకుమార్ ప్రవర్తనపై గ్రామస్తుల నుంచి అభిప్రాయం సేకరించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

మల్లారం వయా... మర్రిపల్లి

- మూలవాగు కేంద్రంగా తరలింపు..!
- నిద్రమత్తులో అధికారులు..?
- తనిఖీచేయని మైనింగ్ శాఖ..!


మూలవాగులో ఇసుకను తరలిస్తున్న మాఫియా

వేములవాడరూరల్: వేములవాడ మూలవాగు నుంచి పెద్దఎత్తున అక్రమంగా ఇసుక తరలిపోతోంది. పట్టణ, రూరల్ ప్రాంతాల మీదుగా మూలవాగు ఇసుకను కొంతమంది ఇసుక వ్యాపారులు పెద్దఎత్తున ప్రతిరోజూ తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం సంబంధిత శాఖల అధికారులకు తెలిసినప్పటికీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మూలవాగు నుంచి మల్లారం మీదుగా మర్రిపల్లి గ్రామం నుంచి ఇతర మండలాలకు పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్నట్లు ఆయా ప్రాంతాల రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు పట్టణ మూలవాగు ప్రాంతం నుంచి కూడా ఇసుకను తరలిస్తూ శాత్రాజుపల్లి, వట్టెంల మీదుగా జగిత్యాల జిల్లాకు ఇసుకను కొంతమంది వ్యాపారులు తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రతి నెలా అధికారులకు ముడుపులు చెల్లిస్తు పెద్దఎత్తున ఇసుకను ఈ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆయా ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో కొంతమంది వ్యాపారులు రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులు ఇసుక మాఫియా నుంచి పెద్దఎత్తున ముడుపులు తీసుకుని అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పట్టణ, రూరల్ శాఖ అధికారులు ఇసుక తరలింపులో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదేమైనప్పటికీ రెండు మండలాల పరిధిలో అధికారులు ఇసుక తరలింపులో పెద్దఎత్తున నెలనెలా ముడుపులు తీసుకుని ఇసుక మాఫియాకు సహకరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు, మైనింగ్ అధికారులు వేములవాడ ఇసుక మాఫియాపై తనిఖీలు నిర్వహించి, ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మర్రిపల్లిలో డంప్..?

వేములవాడ రూరల్ మండలంలోని మూలవాగు నుంచి పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్న పలువురు వ్యాపారులు మర్రిపల్లిలో డంప్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వేములవాడ, రుద్రంగి ప్రధానరోడ్డు పక్కన ఇసుకను భారీఎత్తున డంప్ చేసి అక్కడి నుంచి రాత్రిపూట ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎలాంటి నూతన కట్టడాలు లేనప్పటికీ ఒక భవన నిర్మాణం పక్కన ఇసుకను భారీగా డంప్ చేసి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. పోలీస్‌శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సెస్ ఎన్నికల్లో బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: సెస్ ఎన్నికల్లో బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయని, బీజేపీ నాయకులంటే బీఆర్‌ఎస్ నాయకులకు వణుకు పుడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. వేములవాడలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో తప్పకుండా బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అధికార దుర్వినియోగంతో ఉపఎన్నికలు, సెస్ ఎన్నికల్లో కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. సెస్ ఎన్నికలు ఒక ట్రైలర్ అన్న మంత్రి కేటీఆర్‌కు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిజమైన సినిమా చూపిస్తారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్, నాయకులు అన్నారం శ్రీనివాస్, సుదర్శన్‌యాదవ్, రామతీర్థపు హరీశ్, సగ్గు రాహుల్ ఉన్నారు.

‘శిథిలావస్థలో పాఠశాలలు’


పాఠశాలను పరిశీలిస్తున్న విద్యార్థి నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మన ఊరు మన బడిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పుకుంటున్న ప్రభుత్వం శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను పట్టించుకోవడం లేదని, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారనం ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రాచర్ల బొప్పాపూర్, కిషన్‌దాస్‌పేట, బండలింగంపల్లి, సింగారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం సందర్శించి మాట్లాడారు. పాఠశాలలు శిథిలావస్థలకు చేరి విద్యార్థులపై పెచ్చులూడి పడుతున్నాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యాభ్యాసం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలను గుర్తించి మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్లు, స్వీపర్లను నియమించాలన్నారు. శివసాయి, నవీన్‌రెడ్డి, శివ, ప్రవీన్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ విజయవంతం చేయాలి

- ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. అరుణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుచూపుతో సంపూర్ణ అంధత్వ నిర్మూలన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో రెండోదశ కంటి వెలుగును చేపట్టారన్నారు. జనవరి 18 నుంచి జూన్ 30 వరకు జరిగే రెండోదశ కంటి వెలుగు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అరుణ కోరారు. రాష్ట్రంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లా కంటి వెలుగులో ప్రథమస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ కంటివెలుగును స్థానిక ప్రజాప్రతినిధులు ముందుండి విజయవంతం చేయాలని కోరారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ వంద పని రోజుల్లో అందరికీ కంటి పరీక్షలు చేసేలా కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 26 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణాల్లో ఆరు బృందాలు, గ్రామీణ ప్రాంతాల్లో 20 బృందాలు పనిచేస్తాయన్నారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

వస్త్రోత్పత్తిలో పోటీపడాలి


మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: వస్త్రోత్పత్తిలో ప్రపంచంతో పోటీపడే స్థాయికి సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఎదగాలని రాష్ట్ర పవర్ లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ కోరారు. సిరిసిల్ల టెక్స్‌టైల్‌పార్క్‌లో వస్త్రోత్పత్తిదారులతో బుధవారం సమావేశమయ్యారు. ప్రవీణ్ మాట్లాడుతూ ఆధునిక యంత్రాలను సమకూర్చుకుంటూ.. వస్త్రోత్పత్తిలో నవ్యత, నాణ్యతను పెంచాలని, క్వాలిటీ బాగుంటేనే పోటీలో ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ అండతో వస్త్రపరిశ్రమ ఆధునిక విధానాల వైపు అడుగులు వేయాలని కోరారు. టెక్స్‌టైల్‌పార్క్‌లో కల్పించాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. యూనిట్ల మార్పిడికి సంబంధించి ఎన్‌వోసీ, ఆధునిక ఎయిర్‌జెట్ లూమ్స్ ఏర్పాటు, బతుకమ్మ చీరలు–2023 ఉత్పత్తుల కేటాయింపులపై టెక్స్‌టైల్‌పార్క్ క్లాత్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్ వివరించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన గూడూరి ప్రవీణ్ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఒక్కో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. టెక్స్‌టైల్ పార్క్ క్లాత్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను గూడూరి ప్రవీణ్ ఆవిష్కరించారు. టెక్స్‌టైల్‌శాఖ డీవో ముజాహిద్, పార్క్ కార్యవర్గ సభ్యులు యెల్లె లక్ష్మీనారాయణ, దుబాల మొండయ్య, బొద్దుల వేణుప్రసాద్, ఆడెపు సూర్య, పారిశ్రామికవేత్తలు కల్యాడపు సుభాశ్, బొద్దుల సుదర్శన్, వాసం శ్రీనివాస్, గాజుల రాజేశం, శివప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీ20 సదస్సులో విద్యార్థుల ప్రతిభ

- ట్రైబల్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ
- భారత్ పాత్రపై వ్యాసరచన
- రాష్ట్రస్థాయిలో నిరోషాకు 2వ స్థానం


గవర్నర్ నుంచి అవార్డులు అందుకున్న విజేతలు


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ట్రైబల్ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థి ఎం.నిరోషా శాతవాహన యూనివర్సిటీ తరపున రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ‘జీ20 సదస్సు భారతదేశ భాగస్వామ్య పాత్ర’ అనే అంశంపై వ్యాసరచన పోటీలో పాల్గొని.. రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిచింది. మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై చేతులమీదుగా వెండిపతకం, రూ.4,500 నగదు ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. విద్యార్థినీ నిరోషాను శాతవాహన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఎస్.మల్లేశం, ట్రైబల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధూ, కోఆర్డినేటర్ స్పందన, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థినికి ప్రశంస

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని వ్యవసాయ కళాశాలలో సెకండియర్ విద్యార్థి సదాఫీ ఫర్హీన్‌ను గవర్నర్ తమిళిసై ప్రశంసించారు. జీ–20 శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ‘ఒక భూమి–ఒక కుటుంబం–ఒక భవిష్యత్’ అనే నినాదంపై జరిగిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాజభవన్‌లో గవర్నర్ తమిళిసై విద్యార్థినికి బహుమతి, ప్రశంసాపత్రం అందించారు. వ్యవసాయ కళాశాల డీన్ ఉమామహేశ్వరి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమ నిర్వహణకు ఇంటర్వ్యూ


ఇంటర్వ్యూ చేస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సిరిసిల్లకల్చరల్: వయోవృద్ధుల ఆశ్రమ నిర్వహణకు దరఖాస్తుదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక పరీక్షకు సహాయ వెల్ఫేర్ అసోసియేషన్, విజన్, ప్రకృతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హాజరయ్యారు. జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి,డీఎంహెచ్‌వో సుమన్‌మనోహర్, డీఎస్పీ రవికుమార్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్, డీసీహెచ్‌సి మురళీధర్‌రావు, వయోవృద్ధుల కమిటీ ప్రతినిధులుగా డీడబ్ల్యూవో పి.లక్ష్మీరాజం ఇంటర్వ్యూ చేశారు. ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

సిరిసిల్ల: జిల్లా ఎంపీడీవోల సంఘం 2023 క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ బుధవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్‌తో కలిసి క్యాలెండర్లను ఆవిష్కరించారు. అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీలు లక్ష్మణ్‌రావు, నర్సయ్య, విజయ, పూర్మాని మంజుల, కత్తెరపాక ఉమ, కళావతి, మీనయ్య, నాగం కుమార్, రవి, యేసె వాణి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, అహ్మద్, ఎంపీపీలు చంద్రయ్యగౌడ్, వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్, రేణుక, కరుణ, మానస, స్వరూపారాణి, లావణ్య, వజ్రవ్వ, డీఆర్‌డీఏ ఏపీవో పాపారావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన


రాములు మృతదేహం

సిరిసిల్లటౌన్: ప్రైవేటు వైద్యం వికటించి నిండు ప్రాణం బలైన సంఘటన బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన తక్కల రాములు(55)కు సిరిసిల్ల పాతబస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం వెన్నుపూస ఆపరేషన్ జరిగింది. బుధవారం హఠాత్తుగా గింజుకోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యులను సమాచారం ఇవ్వగా నిర్లక్ష్యం చేసినట్లు ఆరోపించారు. రాములుకు అత్యవసరంగా కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. సిరిసిల్ల ఆస్పత్రిలోనే చనిపోగా సిబ్బంది, యాజమాన్యం తప్పించుకునేందుకే కరీంనగర్‌కు తీసుకెళ్లాలని సూచించినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ముందు శవంతో ధర్నా చేపట్టారు. చికిత్స అందించడంలో ఏమాత్రం అలసత్వం జరుగలేదని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నారు. మృతుడికి భార్య దేవవ్వ, కొడుకు నరేశ్, పెళ్లయిన కూతురు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఆస్పత్రి యాజమాన్యం రూ.2.50 లక్షలు పరిహారం ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

పోస్టల్ మేళా..

సిరిసిల్ల: తపాలా శాఖ అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోస్టల్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా పోస్టల్ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. జిల్లాలోని 87 బ్రాంచి పోస్టాఫీసుల్లో, 10 సబ్ పోస్టాఫీసుల్లో క్షేత్రస్థాయిలో పోస్టల్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే పోస్టల్ మేళా ప్రారంభిస్తారని, పోస్టల్ శాఖ సవరించిన వడ్డీరేట్లను, చిన్నమొత్తాల పొదుపు పథకాలను, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఎక్కువ సంఖ్యలో పోస్టల్ పథకాల్లో చేరి లబ్ధి పొందేలా ప్రజలను చైతన్యవంతం చేస్తామని వివరించారు. ఆయనవెంట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తక్కల రాములు (58) బుధవారం సిరిసిల్లలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు రోజుల క్రితం బైక్ ప్రమాదానికి గురై చికిత్సపొందుతూ కన్నుమూశాడు. రాములు మృతికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్(టోని) సంతాపం తెలిపారు.

వ్యక్తిపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా మంగళవారం కొదురుపాక వద్ద పెట్రోలింగ్ చేస్తున్న ఏఎస్సై చంద్రమౌళి విధులకు ఆటంకం కలిగించిన మండలంలోని నీలోజిపల్లికి చెందిన కొండం శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. తనను శ్రీనివాసరెడ్డి అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించినట్లు ఏఎస్సై ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కమనీయం..‘కుడారై’ ఉత్సవం..




మంగళహారతులతో పూజల్లో పాల్గొన్న మహిళలు

సిరిసిల్లటౌన్/ముస్తాబాద్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సిరిసిల్ల శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయంలో, ముస్తాబాద్ మండలంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, పోతుగల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాల్లో ‘కుడారై ఉత్సవం’ కమనీయంగా జరిగింది. వందలాదిగా భక్తులు హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవ విశిష్టతను అర్చకులు వివరించారు. దంపతులు 108 గంగాళాల్లో పాయసం చేసి గోదారంగనాథులకు నైవేద్యం సమర్పించారు. మహిళలు మంగళహారతులతో స్వామి వారికి నీరాజనం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల విఠల్‌రెడ్డి, ఈవో మారుతిరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్, అర్చకులు కృష్ణమాచారి, రామాచారి, సర్పంచ్‌లు గౌతంరావు, సుమతి, ఆలయకమిటీ చైర్మన్ దేవయ్య, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, పందిరి, శంకర్, రాజు, చారి పాల్గొన్నారు.